క్లుప్తంగా

ఓపెన్ జిమ్ ప్రారంభం



గ్రీన్ బెల్టులో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు మెరీడియం టవర్స్ వద్ద గ్రీన్ బెల్టులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ బెల్టుకు జీవీఎంసీ నిధులు రూ.4లక్షలు వెచ్చించామని తెలిపారు. గ్రీన్ బెల్టులో ఓపెన్ జిమ్ పరికరాలు, పిల్లల ఆట పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ సురేష్, సచివాలయ కార్యదర్శులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మజ్జి గౌరమ్మ విగ్రహం ప్రతిష్ట



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్‌నగర్‌లో పెంటమాంబ అమ్మవారి ఆలయ సన్నిధిలో ఆదివారం మజ్జి గౌరమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, ఆలయ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు

● ఇదే వార్డు శాంతిగిరికాలనీలోని శాంతిదుర్గమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణయాదవ్,గ్రామ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంస్కృతం, యోగాలో ముగిసిన శిక్షణ



ముగింపు వేడుకల్లో అతిథులు, శిక్షకులు, విద్యార్థులు

కంచరపాలెం: స్థానిక దుర్గానగర్ విజ్ఞాన భారతి పాఠశాలలో వారం రోజుల పాటు నిర్వహించిన సంస్కృతంలో శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. సంస్కృతం, యోగాలో సుమారు 100 మందికి శిక్షణ ఇచ్చి ఉచిత భోజనం, వసతి ఏర్పాటు చేసినట్లు వందన కుమారి తెలిపారు. ముగింపు వేడుకల్లో రాష్ట్ర సంస్కృత భారతి అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీరామ్‌కుమార్, ఎం.నాగేశ్వరరావు, డాక్టర్ సుందర్ పెరుమాళ్, ఐఎస్ఎన్ మూర్తి, డాక్టర్ మల్లాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

10న వినియోగదారులకు అవగాహన సదస్సు

గాజువాక: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈనెల 10న అవగాహన సదస్సును నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. గాజువాక సబ్ డివిజన్‌లోని బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్‌లో ఉదయం పది గంటలనుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగనున్నట్టు తెలిపారు. విద్యుత్ సరఫరాలో లోవోల్టేజ్, నూతన సర్వీసులు, నియంత్రికల ఏర్పాటు, మార్పులు, బిల్లుల సవరణలు, ఇతర సమస్యలపై అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు. గాజువాక, చినగంట్యాడ, మింది సెక్షన్‌ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ సదస్సుకు హాజరై విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సదస్సుకు సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ హాజరవుతారని తెలిపారు.

దారి చూపే.. దివ్య క్షేత్రం

● 14న జ్ఞానాపురం రక్షణగిరి మహోత్సవం
● భక్తిశ్రద్ధలతో క్రైస్తవుల నవదిన ప్రార్థనలు
● ప్రత్యేక ఆరాధనలకు ఏర్పాట్లు



ఉత్సవాలకు ముస్తాబైన జీసస్ విగ్రహం



జ్ఞానాపురం రక్షణగిరిపై నవదిన ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కంచరపాలెం: క్రైస్తవుల ప్రసిద్ధ ప్రార్థన మందిరాలకు నెలవుగా జ్ఞానాపురం రక్షణగిరి వన్నెకెక్కింది. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన పునీత పేతురు దేవాలయం, రక్షణగిరి తదితర చర్చిలు నేటికీ ఇక్కడ కళకళలాడుతున్నాయి. రక్షణగిరిపై ప్రభు ఏసుక్రీస్తును స్తుతిస్తూ ప్రార్థనలు చేస్తే మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చింతన కలుగుతాయని క్రైస్తవుల ప్రగాఢ విశ్వాసం. దాదాపు వందేళ్ల కిందట గాలికొండగా పిలవబడి.. కాలక్రమేణా ఈ దివ్యక్షేత్రం రక్షణగిరిగా రూపాంతరం చెందింది. జ్ఞానాపురంలో రక్షణగిరి ఆవిర్భవించిన నాటి నుంచి నిత్య ప్రార్థనా కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. క్రైస్తవులు ఇక్కడి ఆధ్యాత్మిక యాత్రలో ఏళ్లుగా పాలుపంచుకుంటూ తరిస్తున్నారు. మతాలకు అతీతంగా ఇక్కడికి ప్రజలు తరలి వచ్చి ప్రార్థనలు చేస్తారని చర్చి ఫాదర్లు చెబుతున్నారు. అంతటి ప్రాధ్యాన్యం గల రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవం ఈ నెల 14న అంగరంగ వైభవంగా జరగనుంది. వేడుకల్లో భాగంగా ఈ నెల 5 పతాకావిష్కరణతో నవదిన ప్రార్థనలు ప్రారంభించారు. అవి ఈ నెల 14 వరకు కొనసాగుతాయి.

క్రీస్తు రక్షకుని యాత్రాలు

రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలను ప్రతి ఏటా ఘనంగా నిర్వహించేందుకు మే నెల రెండో ఆదివారం క్రీస్తు రక్షకుని యాత్ర వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని రెవరెండ్ ఫాదర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 14 వరకు జరిగే ఉత్సవాలకు ఉత్తరాంధ్ర నుంచి అధిక సంఖ్యలో క్రైస్తవులు తరలి వస్తుంటారు. తొమ్మిది రోజుల పాటు జపమాల, దివ్యబలి పూజలు, మఠవాస సంస్థలచే నవదిన జపములు నిర్వహిస్తారు. 14వ తేదీ ఆదివారం నాడు జరిగే ప్రధాన వేడుకల్లో దివ్యబలి పూజ, రక్షణగిరిపైకి పురప్రదక్షిణ, సమష్టి దివ్యబలి పూజలను విశాఖ అగ్రపీఠాధిపతి(ఆర్చ్ బిషప్) రెవరెండ్ ఫాదర్ మల్లవరపు ప్రకాష్ నిర్వహించనున్నారు. పుణ్యక్షేత్ర మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు రక్షణగిరి పత్రిక సంపాదకులు ఆదిరెడ్డి ఆల్బర్ట్, పారిస్ పాస్టిల్ కౌన్సిల్(పీపీసీ) ప్రతినిధి ఆదిరెడ్డి చార్లీ తెలిపారు.

రక్షణగిరిలో నిత్య కార్యక్రమాలు

● రక్షణగిరిలో ప్రత్యేక ప్రార్థనలతోపాటు ప్రతి శుక్రవారం సాయంత్రం అన్నసమారాధన.
● ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు దివ్యబలి అర్పణలు.
● రేయింబవళ్లు మఠకన్యల నిత్యారాధన.
● రోజంతా ఏసుక్రీస్తుతో విశ్వాసుల భావ ప్రకటన(ఆరాధన).
● ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉపవాస ఆరాధన కూటములు, దివ్యబలి అర్పణలు.
● తపస్సు కాల శుక్రవారాల్లో సిలువ మార్గ తపోక్రియలు.
● జూన్ మొదటి ఆదివారం ఏసు తిరుహృదయ మహోత్సవ సంబరాలు
● ఆగస్టు 1 నుంచి 14 వరకు దేవమాత తేరు ఉత్సవాలు, ఆగస్టు 15న ప్రధాన పండగ నిర్వహిస్తారు.

ఇలా ప్రత్యేక కార్యక్రమాలతో జ్ఞానాపురం రక్షణగిరి విరాజిల్లుతోంది.

రక్షణగిరి ఉత్సవాలకు ఏర్పాట్లు



ఈ నెల 14న నిర్వహించే జ్ఞానాపురం రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే విశ్వాసులకు, ఆయా చర్చిల ఫాదర్లకు అన్ని సదుపాయాలు సమకూర్చాం. ప్రత్యేక ప్రార్థనలు, నవదిన ప్రార్థనల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. అత్యంత ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు క్రైస్తవులు, పీపీసీ సభ్యులు పూర్తి సహకారం అందిస్తున్నారు.

– రెవరెండ్ ఫాదర్ జాన్‌ప్రకాష్, పునీత పేతురు చర్చి

నేడు దుర్గమాంబ తొలేళ్ల సంబరం



ముస్తాబవుతున్న దుర్గాదేవి అమ్మవారు

కంచరపాలెం:స్థానిక గొల్లకంచరపాలెం దరి దుర్గానగర్ వాసుల ఆరాధ్యదైవం దుర్గమాంబ ఉత్సవాలు సోమవారం తొలేళ్లతో ప్రారంభం కానున్నాయి. పండగకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు శ్రీరామా సేవా సమాజం (యాదవ్) అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. సోమవారం సాయంత్రం దొండపర్తి ఎరుకుమాంబ ఆలయం నుంచి అల్లిపురం, కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం మీదుగా దుర్గమాంబ అమ్మవారి ప్రతిమలను కంచరపాలెం కూడలి తోటవీధి సదరం పట్టుకు తీసుకువస్తామని చెప్పారు. మంగళవారం ప్రధాన జాతర నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పల్లా సత్యనారాయణ తెలిపారు.

మణికంఠకు అభినందనల వెల్లువ



టాపర్‌గా నిలిచిన మణికంఠను అభినందిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 592 మార్కులు సాధించి విశాఖ జిల్లా టాపర్‌గా నిలిచిన పూడి మణికంఠస్వామికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పేద కుటుంబంలో పుట్టిన విద్యాకుసుమం అని కొనియాడుతున్నారు. జీవీఎంసీ 62వ వార్డు మల్కాపురం ప్రకాష్‌నగర్‌కు చెందిన పూడి మణికంఠస్వామి పదిలో సత్తాచాటడంతో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆదివారం మణికంఠ ఇంటికి వెళ్లి అభినందించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన మణికంఠ మట్టిలో మాణిక్యం అన్నారు. చదువుకు పేదరికం అడ్డు రాకుడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రథమ ప్రాధాన్యమిస్తున్నారన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెనతో పాటు పలు పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. విద్యార్థి మణికంఠ పరిస్థితిని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి ఉన్నత చదువులకు తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సక్కా సూర్యనారాయణ, రావాడ అప్పారావు, వెంటకరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలను భారతరత్నతో గౌరవించాలి

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దాడి వీరభద్రరావు



ప్రసంగిస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాడి వీరభద్రరావు

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావును భారతరత్నతో గౌరవించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. ఘంటసాల ఆరాధకులు, టెలిగ్రామ్ గ్రూప్ సభ్యుల సమర్పణలో ఘంటసాల ఆరాధనోత్సవాలను డాక్టర్‌సయ్యద్ రహమతుల్లా ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దాడి వీరభద్రరావు మాట్లాడుతూ విశ్వవిఖ్యాత స్వరమాంత్రికుడు ఘంటసాల స్వరం సుస్థిరమైందన్నారు. విశ్వం ఉన్నంత వరకూ ఘంటసాల స్వరం వినిపిస్తునే ఉంటుందన్నారు. అనంతరం డాక్టర్ సయ్యద్ రహమతుల్లా ఘంటసాల అవధాన ప్రక్రియను అద్భుతంగా నిర్వహించారు. ప్రేక్షకులు ఘంటసాల పాటలలో పల్లవి, చరణంలో ఏ ఒక్కటి అడిగినా ఆ చిత్రం పేరు, స్వరపరిచిన సంగీత దర్శకుడు, చిత్రం విడుదల తేదీలతో సహా చెప్పడమే కాకుండా ఆ పాటను కూడా ఆలపించి ఔరా అనిపించారు. ఐదుగురు గాయనీమణులు, ఐదుగురు గాయకులతో నిర్వహించిన పాటల కబడ్డీ అలరించింది. అనంతరం ఘంటసాల నాటిక ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విజయనిర్మాణసంస్థ అధినేత సూరపనేని విజయకుమార్, డాక్టర్.కె.రామమూర్తి, బి.కల్యాణి తమ గానంతో అలరించారు.

సంకీర్తన సార్వభౌముడు అన్నమయ్య

సీతంపేట: శృతిలయ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి ఆశీస్సులతో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అన్నమాచార్యుని 615వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకడిగిన పాదము పేరిట అన్నమాచార్య సంకీర్తన పోటీలు జరిగాయి. పౌర గ్రంథాలయం కార్యదర్శి డి.ఎస్.వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగ్గేయకారుడిగా వేంకటేశ్వర స్వామి సేవలో తరించిన అన్నమయ్య సంకీర్తనా సార్వభౌమునిగా నిలిచారన్నారు. నాలుగు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గురువులు పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు అతిథులు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వి.ప్రభాకర్, సి.హెచ్.వి.సత్యనారాయణ, కొంతాల రాజు, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, ఎస్.ఎస్.ఎన్.రాజు, పుండరీ కుమార్, మేడా మస్తాన్‌రెడ్డి, తిరుమలరావు, ఫణిస్వామి, సుబ్రహ్మణ్యం, జె.ఎస్.ప్రసాద్, న్యాయనిర్ణేతలు, కళాభిమానులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

పాలిమర్స్ బాధితులకు న్యాయం చేయాలి



వెంకటాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

గోపాలపట్నం: ఎల్జీ పాలిమర్స్ ఘటనలో బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని గోపాలపట్నం జోన్ సీఐటీయూ ఉపాధ్యక్షుడు బలివాడ వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వెంకటాపురంలో ఆదివారం దండయాత్ర పేరుతో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించాలన్నారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, గోపాలపట్నం జోన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పి. సత్యనారాయణ, పి. అనసూయ, ఎ. గోవిదరావు, ఆర్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగి మృతి



మృతుడు సతీష్‌కుమార్

సీతమ్మధార: రైల్వే ఉద్యోగి ఒకరు కారులో మృతి చెందిన ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలెం రైల్వే న్యూకాలనీలో నివసిస్తున్న కోమటిపల్లి సతీష్ కుమార్(40) రైల్వేలో టెక్నీషియన్-3గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి తన నివాసం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో కారులో అతడు చనిపోయి ఉండటాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడి సోదరుడు సునీల్ కుమార్ ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం పక్కన గ్లాస్, మద్యం బాటిల్ ఉన్నట్లు గుర్తించారు. అధికారుల ఆదేశాల మేరకు హెచ్‌సీ షణ్ముఖరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

ఘనంగా విశ్వకవి ఠాగూర్ జయంతి



రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆచార్య వెంకటేశ్వర్లు

ఏయూ క్యాంపస్: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. రవీంద్రుని విగ్రహానికి గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు పూలమాల వేసి, అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశిష్ట రచనా శైలితో నోబెల్ బహుమతిని సొంతం చేసుకుని ఠాగూర్ భారతీయ సాహిత్య ప్రతిభను ప్రపంచానికి చాటారన్నారు. అటువంటి మహనీయుడు ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సైతం సందర్శించి, ప్రసంగించారని గుర్తు చేశారు. నేటి తరం విద్యార్థులు ఇటువంటి వారి రచనలను అధ్యయనం చేయడం ఎంతో అవసరమన్నారు.

బీచ్ క్లీనింగ్

మద్దిలపాలెం: ప్లాస్టిక్ ఫర్ చేంజ్ పేరిట డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. తీరంలో చెత్త, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి పారిశుధ్య కార్మికులకు అందజేశారు. బీచ్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను సేకరించడంతో పాటు క్లీనింగ్ కార్యక్రమంలో భాగస్వాములైన ఎన్ఎస్ఎస్ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు పోలా ఉమామహేశ్వరరావు, రత్నభారతి పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అల్లూరి



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గోపాలపట్నం: మన్యం వీరుడు, స్వతంత్ర పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని బుచ్చిరాజుపాలెం సీతారామరాజునగర్ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. సీతారామరాజునగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ మన్యంలో పేదలపక్షాన నిలబడి, ఆంగ్లేయులపై చేసిన పోరాటం అందరికి స్ఫూర్తి దాయకమని కొనియాడారు. కార్యక్రమంలో పి. రాము, గణపతి, సోమేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో...

అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బలివాడ వెంకటరావు, ఎస్. రాజు, పి. అనసూయ, ఆర్. మల్లేష్, పి. సత్యనారాయణ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు

సింథియా: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) మల్కాపురం శాఖ ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 62వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలోని అల్లూరిసీతారామరాజు విగ్రహానికి, 63వ వార్డు పరిధి కాంత్రినగర్, చింతల్లోవలో అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెల్లదొరల గుండెల్లో రైలు పరిగెట్టించిన మన్యంవీరుడు అల్లూరిసీతారామరాజు అని, ఆయన స్ఫూర్తితో కార్మికులు కేంద్ర ప్రభుత్వంపై పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థల జోలికి వస్తే కేంద్ర ప్రభుత్వ పెద్దలకు చెమటలు పట్టేలా పోరాట శక్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పైడిరాజు, సీఐటీయూ నాయకులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి, భవన నిర్మాణ సంఘ నాయకులు జె.రామునాయుడు, బి.జగ్గునాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటు



గుల్లలపాలెంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సురేష్



లేబర్ గేటు వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ లూథర్‌బాబు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు చోట్ల ఆదివారం మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలో వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ పాదచారులు,పలువురు వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమంతరావు,రాజు,సూర్యనారాయణ,అనీల్,సంతోష్ పాల్గొన్నారు.

● జీవీఎంసీ 61వ వార్డు ఆర్‌కేపురం వద్ద స్వేచ్ఛ వలంటీర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మల్కాపురం సీఐ లూథర్‌బాబు పాల్గొని పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు.అలాగే మల్కాపురం వద్ద స్థానిక యాదవ్‌యూత్ ప్రతినిధులు,సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు.

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు గాంధీగ్రామం పశువుల ఆస్పత్రి పక్కన జీవీఎంసీ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు సందర్శించారు. పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో ఆదివారం పాత వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తడం, విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి ప్రమాదకర స్థితిలో ఉండడంతో విద్యుత్ ఉన్నతాధికారులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించామన్నారు. దీనిలో భాగంగా పాత స్తంభాల స్థానంతో కొత్తవి అమర్చడం, కొత్త వైర్లు ఏర్పాటు వంటి పనులు చేపట్టామన్నారు. దీంతో ప్రజలకు విద్యుత్ సమస్యలు తొలగనున్నాయని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దేవీపురం క్షేత్రంలో ప్రత్యేక పూజలు



అమ్మవారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్కాపురంలోని జనతాకాలనీలో జయదుర్గ పీఠాన్ని గురూజీ అమృతానంద స్వామీజీ 20 సంవత్సరాల కిందట స్థాపించారు. నాటి నుంచి ఏటా మే 7వ తేదీన అక్కడి భక్తులు జయదుర్గా అమ్మవారిని ఊరేగింపుగా దేవీపురంలోని పుట్టింటికి తీసుకురావడం ఆనవాయితీగా జరుగుతుంది. దీనిలో భాగంగా మరియ దాసు,ఆడారి అప్పారావు తదితరులు కమిటీ తరపున వచ్చి అమ్మవారికి క్షీరాభిషేకం,షోడశోపచార పూజ,లలితా సహస్రనామ పారాయణం చేయించారు. ఇటు వంటి కార్యక్రమాలు మంచి పరిణామానికి దారితీయడమే కాకుండా ప్రపంచ శాంతికి దారితీస్తాయని గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. సాయంత్రం మళ్లీ జయదుర్గా అమ్మవారిని పల్లకీలో ఊరేగింపుగా మల్కాపురంలోని జనతా కాలనీకి తీసుకువెళ్లారు.

జాతీయ భావాలతో బీఎంఎస్ అడుగులు



సమావేశంలో పాల్గొన్న బీఎంఎస్ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు హిరణ్మయ పాండ్య

అక్కిరెడ్డిపాలెం: భారత ప్రభుత్వంలో అత్యధిక సభ్యత్వం కలిగిన సంఘంగా భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) గుర్తింపు పొందిందని బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు హిరణ్మయ పాండ్య చెప్పారు. 69వ వార్డు షీలానగర్ బీవీకే స్కూల్ ఆడిటోరియంలో ఆదివారం బీఎంఎస్ ఎల్ 20 జన భాగీధారీ సదస్సు నిర్వహించారు. బీఎంఎస్ జాతీయ్య అధ్యక్షుడు హి రణ్మయ పాండ్య, ఇతర నాయకులు భారతమాత, విశ్వకర్మభగవాన్, బీఎంఎస్ వ్యవస్థాపకుడు దత్తోపత్ తెంగడి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పాండ్య మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో కార్మిక సంఘాలను నడిపించే రెండు ఫెడరేషన్లు డబ్ల్యూఎఫ్‌టీయూ, ఐటీయూసీ పనిచేస్తున్నాయన్నారు. బీఎంఎస్ మాత్రం విదేశీ భావజాలాలకు అతీతంగా స్వతంత్రంగా పని చేస్తోందన్నారు. ఎల్ 20 ప్రారంభం నుంచి ఏ దేశంలో సమావేశాలు జరిగినా ఐటీయూసీ వారే అధ్యక్ష స్థానం వహిస్తున్నారని తెలిపారు. జీ 20 అధ్యక్ష స్థానం భారతదేశానికి వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం దేశంలో అతిపెద్ద కార్మిక సంఘానికి ఎల్ 20 అధ్యక్ష స్థానం ఇవ్వాలని నిర్ణయించిందన్నారు.